ప్రతి అంశంపై అఫిడవిట్ ఇవ్వాలి

- ఇంజినీర్లకు జస్టిస్ ఘోష్ ఆదేశం
- 'కాళేశ్వరం'పై విచారణ ప్రారంభం
- కమిషన్‌కు మొత్తం 54 ఫిర్యాదులు
- తొలిరోజు రిటైర్డ్ ఈఎన్సీలు, మరో ఏడుగురు అధికారులతో విచారణ
- నేడు 18 మంది ఇంజినీర్లతో..
- ముందుగా సాంకేతిక, తర్వాత ఆర్థిక అంశాలపై దృష్టి పెడుతామని వెల్లడి

హైదరాబాద్, జూన్10 (నమస్తే తెలంగాణ): 'కాళేశ్వరం ప్రాజెక్టు' విచారణలో వెల్లడించే ఏ అంశాన్నయినా అఫిడవిట్ ద్వారా తెలపాలని ఇరిగేషన్ ఇంజినీర్లకు న్యాయవిచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ సూచించారు. ప్రాజెక్టుపై విచారణకు ప్రభుత్వం నియమించిన కమిషన్ చైర్మన్ ఇటీవల క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తాజాగా బీఆర్‌కే భవన్‌లో విచారణను ప్రారంభించారు. తొలిరోజు సోమవారం రిటైర్డ్ ఈఎన్సీలు మురళీధర్, నల్లా వెంకటేశ్వర్లు, మరో ఐదుగురు ఇంజినీర్లను చైర్మన్ ఘోష్ విచారించారు. మేడిగడ్డ బరాజ్‌కు సంబంధించిన పలు అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెల్లడించిన ప్రతి అంశాన్ని అఫిడవిట్‌గా దాఖలు చేయాలని సూచించారు.

మరికొంత సమయం పడుతుంది : జస్టిస్ ఘోష్

విచారణ అనంతరం జస్టిస్ ఘోష్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించారు. ప్రాజెక్టుపై విచారణను ప్రారంభించామని, అన్ని విషయాలు రాబోయే రోజుల్లో బయటకు వస్తాయని వెల్లడించారు. కమిషన్‌కు ఇప్పటివరకు మొత్తం 54 ఫిర్యాదులు వచ్చాయని, అందులో నష్టపరిహారం ఫిర్యాదులు కూడా ఉన్నాయని, వాటిని కూడా విచారిస్తామని వెల్లడించారు. ఎలక్షన్‌కోడ్ నేపథ్యంలో కొంత ఆలస్యమైందని, జూన్ 30లోగా విచారణ పూర్తి కాదని, ఇంకాస్త సమయం పడుతుందని చెప్పారు. అసలు విషయాలు తెలుసుకోకుండా పూర్తి నివేదిక ఇవ్వలేనని స్పష్టం చేశారు. ప్రాజెక్టు నిర్మాణంలో పాలుపంచుకున్న ఏజెన్సీలను కూడా పిలిచి విచారిస్తున్నామని, నిజాలు తెలుసుకునేందుకు అందరి వద్దా సమాచారం తీసుకుంటున్నామని వివరించారు. నేడు సైతం విచారణ రావాలని 18 మందికి నోటీసులిచ్చామని తెలిపారు. సాంకేతిక అంశాలపై విచారణ పూర్తయ్యాకనే, ఆర్థిక, ఇతర అంశాలపై దృష్టి పెడుతామని వెల్లడించారు. ప్రభుత్వం నుంచి రిపోర్టులన్నీ అందాయని, వాటిని పరిశీలిస్తున్నామని తెలిపారు.

మేడిగడ్డలో గ్రౌటింగ్ పనులు మొదలు

- డౌన్ స్ట్రీమ్‌లో సీసీ బ్లాక్‌ల రీ అరేంజ్‌మెంట్
- పనులను పరిశీలించిన భారీ నీటిపారుదల శాఖ ఈఈ

మేడిగడ్డ బరాజ్ అప్ స్ట్రీమ్‌లో కొనసాగుతున్న మరమ్మతులు

మహదేవపూర్/కాళేశ్వరం, జూన్ 10 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌లో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులను భారీ నీటిపారుదల శాఖ ఈఈ తిరుపతిరావు సోమవారం పరిశీలించారు. బరాజ్‌లోని ఏడో బ్లాక్‌లో కుంగిన 19, 20, 21వ పియర్ల వద్ద గ్రౌటింగ్, డౌన్ స్ట్రీమ్‌లో సీసీ బ్లాక్‌ల రీ అరేంజ్‌మెంట్ పనులను నిర్మాణ సంస్థ ఎల్ అండ్‌టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. బరాజ్‌లో ఏడో బ్లాక్‌లోని 21 గేట్ ఎత్తేందుకు వీలుకాకపోవడంతో ఆర్క్ గ్రౌటింగ్ పరికరంతో కట్ చేశారు. ముక్కల తొలగింపు ప్రక్రియ ముగిశాక 20వ గేట్ కటింగ్ పనులు ప్రారంభించనున్నట్టు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బరాజ్‌లో లోపాలపై అధ్యయనానికి సీఎస్ఎంఆర్ఎస్ నిపుణుల బృందం ఆధ్వర్యంలో చేపట్టిన పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా కుంగిన ప్రాంతంలో యంత్రాలతో డ్రిల్లింగ్ చేసి నమూనాలు సేకరిస్తున్నారు. అలాగే అన్నారం (సరస్వతీ) బరాజ్‌లో ఎన్‌డీఎస్ఏ సూచనల మేరకు సీపేజ్‌లో సాయిల్ టెస్టు పనులు ప్రారంభమయ్యాయి. బరాజ్‌లోని 35వ గేట్ వద్ద 25 మీటర్ల లోతు వరకు బోర్ వేస్తూ ప్రతి మూడు మీటర్లకు ఒక టెస్ట్ చేస్తున్నారు. అలాగే సాయిల్ పెనట్రేషన్ టెస్ట్ (ఎస్‌పీటీ) చేస్తున్నారు. ఒక గేట్ వద్ద ప్రతి టెస్ట్‌కు నాలుగు రోజుల సమయం పడుతుందని అధికారులు తెలిపారు. బరాజ్‌లో 35, 28, 38, 44వ గేట్ల వద్ద టెస్టులు చేయాల్సి ఉన్నదని చెప్పారు. సాయిల్ (మట్టి) శాంపిల్‌ను పుణెలోని సీడబ్ల్యూపీఆర్ఎస్ ల్యాబ్‌కు పంపించనున్నామని, వచ్చే నివేదిక ఆధారంగా పనులు చేపడతామని వారు పేర్కొన్నారు.

గొర్రెల పంపిణీ అక్రమాలపై విచారణ

కీలక విషయాలు రాబట్టేందుకు ఏసీబీ అధికారుల యత్నం

హైదరాబాద్/ నాంపల్లి కోర్టులు జూన్ 10 (నమస్తే తెలంగాణ) : గొర్రెల పంపిణీ అక్రమాలపై ఏసీబీ అధికారులు సోమవారం నుంచి విచారణ చేపట్టారు. మూడు రోజుల పాటు జరిగే ఈ విచారణలో పలు కీలక విషయాలు రాబట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నట్టుగా తెలిసింది. గొర్రెల పంపిణీ అక్రమాలపై ఇటీవల మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాజీ ఓఎస్డీ గుండమరాజు కల్యాణ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సబావత్ రాంచందర్‌ను ఏసీబీ అదుపులోకి తీసుకొన్నది. వీరిని ఏడు రోజుల విచారణ కోరగా.. నాంపల్లి కోర్టు మూడు రోజుల కస్టడీకి అనుమతి ఇచ్చింది. దీంతో వైద్య పరీక్షల అనంతరం చంచల్‌గూడ జైలు నుంచి ఉదయం పది గంటలకు ఏసీబీ ప్రధాన కార్యాలయానికి తరలించారు. 12 సాయంత్రం 5గంటలలోపు నిందితులను కోర్టు ఎదుట హాజరుపర్చాలని కోర్టు ఆదేశించింది.

ఎల్లమ్మకు నైవేద్యం

ఎల్లమ్మ తల్లికి గీత కార్మికులు కల్లు కుండతో నైవేద్యం సమర్పించారు. కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎల్లమ్మ పట్నాలు నిర్వహించారు. గీత కార్మికులు తాటి చెట్టు పైకి ఎక్కారు. కల్లు కుండ ఒలుకకుండా కిందికి దించి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు – కరీంనగర్ రూరల్

కృష్ణానదికి వరద రాక

మక్తల్/ధరూరు/అయిజ, జూన్ 10 : ఎగువన కురుస్తున్న వర్షాలతో కృష్ణానదికి వరద వస్తున్నది. మూడు రోజులుగా వరద నిలకడగా వస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఎగువ నుంచి కృష్ణానదికి వరద రాకుండా అడ్డుకునేందుకు కర్ణాటక రాష్ట్రం రాయిచూర్ జిల్లా బీర్జాపూర్ వద్ద రోడ్–కం–బరాజ్ నిర్మించారు. అయితే, భారీగా వరద వస్తుండటంతో సోమవారం బీర్జాపూర్ బరాజ్ గేట్లు తెరిచేందుకు అధికారులు ప్రయత్నించగా.. గేట్లు మొరాయించాయి. దీంతో వరద సిల్వ్‌వే గేట్ల పైనుంచి పారుతున్నది. ఇంకా భారీ వర్షాలు కురుస్తున్నందున మరో రెండు,మూడు రోజుల్లో కృష్ణమ్మకు వరద పోటెత్తే అవకాశం ఉన్నదని అధికారులు తెలిపారు. కాగా జూరాల ప్రాజెక్టుకు సోమవారం 3,806 క్యూసెక్కులు, కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు 4,550 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. ఆర్డీఎస్ ఆనకట్టకు 6,658 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, అంతే వరద దిగువకు పారుతున్నది.

బీర్జాపూర్ రోడ్–కం–బరాజ్ గేట్ల పైనుంచి దిగువకు పారుతున్న వరద

రాష్ట్రపతి భవన్‌లో కనపడ్డది పిల్లి!

మోదీ ప్రమాణ స్వీకారంలో కనిపించిన జంతువుపై ఢిల్లీ పోలీసులు వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 10: దేశ ప్రధానిగా మోదీ, ఆయన మంత్రివర్గం ప్రమాణస్వీకారం చేస్తున్న వేళ రాష్ట్రపతి భవన్‌లోకి అనుకోకుండా ఓ పెంపుడు జంతువు ప్రవేశించదన్న వీడియో ఒకటి సంచలనం రేపుతున్నది. అది పులి..కాదు పిల్లి? కాదు మరో పెంపుడు జంతువు..అంటూ అనేక ఊహాగానాలు వెలువడ్డాయి. దీనిపై సోమవారం ఢిల్లీ పోలీసులు స్పష్టత ఇచ్చారు. 'స్టేజీ వెనుకాల కనిపించిన జంతువు...ప్రతి ఇంట్లో ఉండే సాధారణ పిల్లి. రాష్ట్రపతి భవన్‌లో పెంపుడు కుక్కలు, పిల్లులు మాత్రమే ఉన్నాయి' అని సోషల్ మీడియా 'ఎక్స్'లో సందేశాన్ని పోస్ట్ చేశారు. రాష్ట్రపతి భవన్ ఎస్టేట్‌లో చిరుత పులి ఉన్నట్టు ఎలాంటి నివేదికలు లేవని అటవీ శాఖ అధికారులు కూడా ప్రకటన విడుదల చేశారు. అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలోకి అనుమానాస్పద జంతువు ఒకటి వచ్చిందని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున కామెంట్స్ వెలువడ్డాయి. దీంతో ఈ వీడియోపై ఢిల్లీ పోలీసులు స్పందించాల్సి వచ్చింది.

ప్రజావాణిలో భాగంగా నెన్నెల ఎంపీడీవో కార్యాలయానికి పురుగు మందు డబ్బాతో వచ్చి ఫిర్యాదు చేస్తున్న రైతు జనార్దన్

పురుగుమందు డబ్బాతో రైతు నిరసన

మామిడి పంట డబ్బులు ఇవ్వాలని డిమాండ్ • ప్రజావాణిలో ఎంపీడీవోకు ఫిర్యాదు

నెన్నెల, జూన్ 10 : మామిడి పంట అమ్మి నెల రోజులైనా డబ్బులు ఇవ్వడం లేదని, అధికారులు కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిప్పించుకుంటున్నారంటూ ఓ రైతు ప్రజావాణిలో పురుగు మందుడబ్బాతో హల్‌చల్ చేశాడు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా నెన్నెల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగింది. చిత్తాపూర్ గ్రామానికి చెందిన రామడుగు జనార్దన్ నెల క్రితం 6 టన్నుల మామిడి కాయలను రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో విక్రయించాడు. ఐకేపీ వారు హర్యానాకు చెందిన విగ్రో సంస్థతో కలిసి కొనుగోళ్లు చేపడుతుండగా, ఏ–గ్రేడ్ మామిడి కిలోకు రూ.35, బీ–గ్రేడ్‌కు రూ.30 చొప్పున ధర నిర్ణయించారు. పంట అమ్మి నెల కావస్తున్నా డబ్బులు ఇవ్వకుండా దాట వేస్తూ వస్తున్నారని మండిపడుతూ మరో రైతు శ్రీనివాస్‌తో కలిసి సోమవారం ఐకేపీ కార్యాలయానికి వచ్చాడు. రూ.1.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జనార్దన్ పురుగు మందు డబ్బాతో కార్యాలయం ఎదుట దాదాపు మూడు గంటలపాటు బైఠాయించినా అధికారులెవ్వరూ రాలేదు. దీంతో ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణికి పురుగు మందు డబ్బాతో వెళ్లి తమకు న్యాయం చేస్తారా? లేదా మందు తాగమంటారా? అనడంతో ఎంపీడీవో దేవేందర్ కలుగజేసుకొని ఫిర్యాదు తీసుకున్నారు. ఆపై ఎంపీడీవో జిల్లా ఐకేపీ డీపీఎం సంజీవ్‌కు పలుమార్లు ఫోన్ చేయగా స్పందించలేదు. ఏపీఎంకు ఫోన్ కలిపి రైతు జనార్దన్‌తో మాట్లాడించారు. చివరకు కిలోకు రూ.35 చొప్పున ఇవ్వడానికి అధికారులు ఒప్పుకోవడంతో రైతు జనార్దన్ శాంతించారు.

ఆటా 18వ సదస్సులో ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకొంటున్న మిర్యాల మురళీధర్

మిర్యాల మురళీధర్‌కు ఆటా ఎక్స్‌లెన్స్ అవార్డు

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ) : విద్యావేత్త ప్రొఫెసర్ మిర్యాల మురళీధర్‌కు సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో ఆటాఎక్స్‌లెన్స్ అవార్డు దక్కింది. అమెరికాలోని ఆటా 18వ సదస్సులో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన అందుకొన్నారు. హై టెంపరేచర్ సూపర్ కండక్టివిటీ సాంకేతికతను అభివృద్ధి చేసినందుకు ఆయన అవార్డుకు ఎంపికయ్యారు. ఉస్మానియా పూర్వ విద్యార్థి మురళీధర్ జపాన్‌లోని షిబరా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఆచార్యుడిగా సేవలందిస్తున్నారు. ఎందరో తెలంగాణ, భారతీయ విద్యార్థులు జపాన్‌లో చదువుకొనేలా ఆయన ప్రోత్సహించడమే కాకుండా మార్గదర్శిగా నిలుస్తున్నారు.

ఛత్తీస్‌గఢ్ నుంచే విద్యుత్తు ఎందుకు కొన్నారు?

- బీహెచ్ఈఎల్‌కే ప్లాంట్‌ను ఎందుకిచ్చారు?
- మాజీ సీఎండీలను ప్రశ్నించిన జ్యూడీషియల్ కమిషనర్

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచే విద్యుత్తును ఎందుకు కొనుగోలుచేశారని జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ ప్రశ్నించింది. భద్రాద్రి ప్లాంట్‌ను బీహెచ్ఈఎల్‌కు ఎందుకిచ్చారని అడిగింది. ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్తు ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి విద్యుదుత్పత్తి కేంద్రాల నిర్మాణంపై ప్రభుత్వం నియమించిన జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ సోమవారం విచారణ జరిపింది. ఇప్పటికే పలువురికి నోటీసులు అందజేసిన కమిషన్.. గతంలో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీలుగా పనిచేసిన దేవులపల్లి ప్రభాకర్‌రావు, సురేశ్‌చద్దాలను విచారించింది. బీఆర్కే భవన్‌లో జస్టిస్ నర్సింహారెడ్డి ముందు వీరు విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఛత్తీస్‌గఢ్‌తోనే ఎందుకు ఒప్పందం చేసుకోవాల్సి వచ్చిందని కమిషన్ ప్రశ్నించగా గవర్నమెంట్ టు గవర్నమెంట్ అయితే పారదర్శకత ఉంటుందని సమాధానం ఇచ్చినట్టు తెలిసింది. ఓపెన్ యాక్సెస్‌కు ఎందుకెళ్లలేదని అడుగగా అప్పట్లో ఉన్న ధరలను అనుసరించి అత్యంత తక్కువకే ఛత్తీస్‌గఢ్‌తో ఒప్పందం చేసుకున్నామని వివరించినట్టు సమాచారం. యాదాద్రి పవర్‌ప్లాంట్ కోసం దామరచర్లను ఎందుకు ఎంపికచేశారని ప్రశ్నించగా పోర్టుకు అత్యంత దగ్గరగా ఉండటం, ప్లాంట్ అవసరాలు తీర్చేందుకు సరిపడా నీళ్లు అందుబాటులో ఉండటం, సమీపంలో సిమెంట్ పరిశ్రమలుండటంతో ఫ్లైయాష్‌ను సులభంగా డిస్పోజ్ చేయగలమన్న ఉద్దేశంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం దామరచర్లను ఎంపికచేసిందని చెప్పినట్టు తెలిసింది. ఇక 12వ ప్లాన్‌లో కేంద్రం ఈ ప్లాంట్‌కు బొగ్గు కేటాయించలేదని ఇది కూడా ఓ కారణమని వారు చెప్పినట్టు సమాచారం. ఇక యాదాద్రి ప్లాంట్‌లో సబ్‌క్రిటికల్ టెక్నాలజీని ఎందుకు వాడారని అడుగగా, అప్పట్లో సబ్‌క్రిటికల్ టెక్నాలజీపై నిషేధమేమీ లేదని, అప్పట్లో ఉన్నవన్నీ సబ్‌క్రిటికల్ ప్లాంట్లేనని, రాష్ట్ర అవసరాలను త్వరగా తీర్చాలన్న ఆలోచనతో త్వరగా నిర్మించే ప్రయత్నంచేశామని, ఈ ప్లాంట్‌కు కేంద్రం అన్ని రకాల అనుమతులు ఇచ్చిందని వారు వివరించినట్టు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. భద్రాద్రి ప్లాంట్ నిర్మాణంలో టెండర్లకు వెళ్లకుండా బీహెచ్ఈఎల్‌కు ఎందుకిచ్చారని అడుగగా, బెంచ్ మార్క్ కంటే తక్కువకు కోట్‌చేయడంతోనే ఇచ్చామని వారు తెలిపినట్టు సమాచారం. మరో ఇద్దరు ఐఏఎస్ అధికారులను కమిషన్ విచారించనున్నట్టు తెలిసింది. గతంలో ఇంధనశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలుగా పనిచేసిన ఎస్కే జోషి, అర్వింద్‌కుమార్‌లను విచారించనట్టు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుత సీఎండీ ఎస్ఏఎం రిజ్వీని సైతం విచారించే అవకాశముందని సమాచారం.

సర్కారు వైద్యమే బిడ్డ ప్రాణం తీసింది!

- మత్తు ఎక్కువిచ్చిన వైద్యుడే పొట్టన పెట్టుకున్నడు
- ఆయనపై క్రిమినల్ కేసు పెట్టాలి
- సూర్యాపేట దవాఖాన ఎదుట మృతురాలి తల్లిదండ్రులు ఆందోళన

సూర్యాపేటలోని దవాఖాన ఎదుట ఆందోళన చేస్తున్న బాలిక కుటుంబ సభ్యులు

బొడ్రాయిబజార్, జూన్ 10 : తమ కూతురి మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు సోమవారం సూర్యాపేట దవాఖాన ఎదుట ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేటకు చెందిన రత్నావత్ సైదులు, రమ్య దంపతుల కుమార్తె హరిస్మిత (17) టాన్సిల్స్‌తో బాధపడుతుండగా.. మే 20న సూర్యాపేట ప్రభుత్వ జనరల్ దవాఖానలో చేర్పించారు. పరిశీలించిన డాక్టర్ ఆపరేషన్ అవసరమని చెప్పి అందుకు అవసరమైన పరీక్షలన్నీ చేశారు. మే 31న ఉదయం 9గంటలకు ఆపరేషన్ చేసేందుకు థియేటర్‌లోకి తీసుకెళ్లారు. మధ్యాహ్నం అవుతున్నా ఆపరేషన్ గది నుంచి బయటకు రాకపోవడంతో ఆందోళన చెందిన యువతి తల్లిదండ్రులు సదరు డాక్టర్‌ను కలిసి వివరాలు అడిగారు. అనస్థీషియా వేయడంతో అపస్మారక స్థితికి వెళ్లిందని, అందుకు చికిత్స చేసేందుకు ఇక్కడ సరైన సదుపాయాలు లేవని, గాంధీ దవాఖానకు వెళ్లాలని చెప్పగా వెంటనే తరలించారు. గాంధీ దవాఖానలో వైద్యం పొందుతున్న ఆ బాలిక స్పృహలోకి రాకుండానే ఈ నెల 4న మృతిచెందింది.

సదరు డాక్టరే తమ బిడ్డకు మోతాదుకు మించి మత్తు మందు ఇవ్వడం వల్లే మృతిచెందిందని తల్లిదండ్రులు ఆరోపించారు. సదరు డాక్టర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవడంతోపాటు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సోమవారం దవాఖాన ఎదుట ఆందోళన చేశారు. వీరి ఆందోళనకు సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు మద్దతు పలికారు. అనంతరం వీరు సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేయగా.. విచారణ కమిటీ వేసి నిజాలు తేల్చి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నకిలీ మందులపై ఉక్కుపాదం: మంత్రి దామోదర

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): నకిలీ మందుల తయారీదారులను ఉక్కుపాదంతో అణచివేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. సోమవారం టీజీపీఎస్సీ ద్వారా ఎంపికైన 17 మంది డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లకు మంత్రి హైదరాబాద్‌లో నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నకిలీ మందుల నివారణ కోసం సిబ్బంది సంఖ్యను పెంచుతున్నామని చెప్పారు.

భూ నిర్వాసితులను న్యాయం చేస్తాం ..

మల్లన్నసాగర్, అనంతగిరి, రంగనాయకసాగర్, గౌరవెల్లి, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్లలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేస్తామని రాజనర్సింహ హామీ ఇచ్చారు.

చేప పిల్లల టెండర్లలో జాప్యం లేదు

- 'నమస్తే తెలంగాణ' కథనంపై స్పందించిన మత్స్యశాఖ

ప్రభుత్వ వివరణ

హైదరాబాద్, జూన్ 10(నమస్తే తెలంగాణ): ఈ ఏడాది చేపలు, రొయ్య పిల్లల పంపిణీ కోసం నిర్వహించే టెండర్లలో ఎలాంటి జాప్యం జరగడంలేదని, ఇందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మత్స్యశాఖ కమిషనర్ గోపి తెలిపారు. చేప పిల్లల పంపిణీ ప్రక్రియలో జాప్యంపై సోమవారం 'చేపా చేపా.. చెరువుకు తొవ్వేది' శీర్షికన నమస్తే తెలంగాణలో వచ్చిన కథనానికి ఆయన వివరణ ఇచ్చారు. నిరుడు జూన్ రెండోవారంలో టెండర్ల ప్ర క్రియ ప్రారంభించి జూలై ఆఖరివారంలో టెండర్లు ఖరారు చేసినట్టు పేర్కొన్నారు.

రోడ్ల అభివృద్ధి పనులకు టెండర్లు

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్ల అభివృద్ధికి సంబంధించి కోర్ రోడ్ నెట్‌వర్క్ (సీఆర్ఎన్) కింద రూ. 1542.26 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా 39 రోడ్ల అభివృద్ధికి పనులను మంజూరు చేసిన విషయం విదితమే. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పనులను రద్దు చేసి రూ. 1097 కోట్లతో 53 రోడ్లకు మంజూరీ ఇచ్చింది. పార్లమెంటు ఎన్నికలకు ముందే టెండర్లు పూర్తిచేయగా, ఎన్నికల కోడ్‌తో పనులు చేపట్టలేదు. కోడ్ తొలగిపోవడంతో తొందరలోనే కాంట్రాక్టర్లతో ఒప్పందాలు చేసుకొని పనులు చేపట్టనున్నట్టు అధికారులు వెల్లడించారు. నల్లగొండ జిల్లా నుంచి 17 రోడ్లు ఉండగా, వాటి వ్యయం రూ. 300 కోట్లు కానుంది. ఖమ్మం జిల్లాకు రూ. 200 కోట్లతో 7 రోడ్లు, సూర్యాపేట జిల్లాకు రూ. 115 కోట్ల తో 8 రోడ్ల అభివృద్ధి పనులు చేపడుతున్నారు. రూ. 1097 కోట్ల పనుల్లో రూ. 615 కోట్ల పనులు ఈ మూడు జిల్లాల్లోనే చేపడుతున్నా రు. నల్లగొండ, ఖమ్మం, సూర్యాపేట్, ములు గు జిల్లాల్లో అత్యధికంగా రోడ్ల అభివృద్ధి ప నులు చేపడుతున్నారు.

ఏఈవోల సస్పెన్షన్ ఎత్తివేయాలి

తొర్రూరులో రైతుల ధర్నా

తొర్రూరు, జూన్ 10 : మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల పరిధిలోని పలువురు వ్యవసాయ విస్తరణాధికారుల (ఏఈవో)పై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తొర్రూరు వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు లు మాట్లాడుతూ.. జీలుగ విత్తనాల అవినీతి బాగోతం నుంచి తప్పించుకునేందుకు ఏవో సోమకుమార్, ఏడీఏ కలిసి ఏఈవోలు జమున, దీపిక, అరవింద్‌ను సస్పెండ్ చేశారని విమర్శించారు. జీలుగ విత్తనాల దందాలో ఎటువంటి ప్రమేయం లేని ఏఈవోలను సస్పెండ్ చేయడం సిగ్గుచేటని అన్నారు. ఏవో కుమార్ జీలుగ విత్తనాలను పక్క రాష్ట్రాలకు అమ్ముకున్నారని, తనను తాను రక్షించుకునేందుకు ఏఈవోలను ఈ అవినీతిలోకి లాగినట్టు ఆరోపించారు. విచారణ అధికారిగా వచ్చిన ఏడీఏ కూడా అవినీతిలో భాగమయ్యాడని, రైతులను విచారించలేదని అన్నారు. విక్రయ కేంద్రాల యజమానులు ఏఈవోల పాత్ర లేదని చెప్పిన నివేదికను కూడా తారుమారు చేశారని మండిపడ్డారు. తక్షణమే విజిలెన్స్ అధికారులచే నిష్పక్షపాత విచారణ జరిపించాలని, లేకుంటే భవిష్యత్ కార్యాచరణ ప్రకటించాల్సి వస్తుందని రైతులు హెచ్చరించారు.

కౌలురైతులకు రైతు భరోసా ఇవ్వాలి: సీపీఎం

హైదరాబాద్, జూన్ 10(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలల్లో ఇచ్చిన హామీ ప్రకారం కౌలు రైతులకు ఈ వానకాలం నుంచే రైతుభరోసా అమలు చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. రాష్ట్రంలో 20 లక్షల మంది కౌలు రైతులు 30 శాతానికి పైగా వ్యవసాయం చేస్తున్నారని చెప్పారు. సోమవారం జరిగిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశంలో పొలిట్ బ్యూరో సభ్యులు విజయరాఘవన్, బీవీ రాఘవులు పాల్గొని పార్లమెంట్ ఎన్నికలు, రాజకీయ పరిణామాలపై చర్చించారు. ఫీజు రీయింబర్స్ మెంట్ , ఉద్యోగుల సప్లిమెంటరీ బిల్లులు, గ్రాట్యుటీ, జీవిత బీమా, జీపీఎఫ్, సరెండర్ లీవ్స్, కమ్యూటేషన్ బిల్లులు, గ్రామపంచాయతీ, మున్సిపల్, ప్రభుత్వ హాస్పిటల్స్ కాంట్రాక్ట్ కార్మికులకు , 104 ఉద్యోగుల బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

పెండింగ్ వేతనాల కోసం కార్మికుల ఆందోళన

భద్రాచలం, జూన్ 10 : ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ప్రభుత్వ ఏరియా దవాఖాన ఎదుట సోమవారం ఔట్ సోర్సింగ్ కార్మికులు ధర్నా చేపట్టారు. కార్మికుల ఆందోళనతో శానిటేషన్ పనులు నిలిచిపోయాయి. దీంతో స్పందించిన ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ కార్మికులకు తక్షణమే ఒక నెల వేతనం మంజూరు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేశ్ మాట్లాడుతూ.. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి.. అతడి కాంట్రాక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఆందోళన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అక్కడికి చేరుకొని మిగతా పెండింగ్ వేతనాలను పది రోజుల్లో చెల్లించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు ఆందోళన విరమించారు. పది రోజుల్లో సమస్యను పరిష్కరించకపోతే తిరిగి సమ్మె కొనసాగిస్తామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు.

జైనూర్‌లో ఆదివాసీల ధర్నా

జైనూర్, జూన్ 10 : ఆదివాసీల రాజ్యాంగ హక్కులను పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంర శంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా